క్లుప్తంగా

విధుల్లో చేరిన ట్రాన్స్‌కో ఎస్ఈ శ్రీరాంమూర్తి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ట్రాన్స్ కో ఎస్ఈ శ్రీరాంమూర్తి విధుల్లో చేరారు. వ్యక్తిగత కారణాలతో దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిన ఆయన బుధవారం విధుల్లో చేరారు. ఇప్పటి దాకా ఇన్‌చార్జ్ ఎస్ఈగా నారాయణపేట ఎస్ఈ ప్రభాకర్ వ్యవహరించారు.

త్వరలో డ్రెయినేజీ పనులు



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక ఐదో వార్డు పరిధిలోని సగర కాలనీలో డ్రెయినేజీ పనులు త్వరలోనే చేపడతామని డీసీసీబీ వైస్ చైర్మన్ కె.వెంకటయ్య అన్నారు. బుధవారం ఆయన్ను కాలనీవాసులు కలిసి స్థానిక సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కాగా, ఏ పని ఉన్నా తాను సంపూర్ణ సహకారం అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు.

ఆర్థిక సాయం అందజేత



అడ్డాకుల: మండలంలోని కందూర్‌కి చెందిన చిన్న మున్నీ మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని బుధవారం బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మున్నూర్ రమేష్ పరామర్శించారు. మృతురాలి అంత్యక్రియల నిమిత్తం రూ.5 వేల ఆర్థిక సాయం అందించి కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కొత్త కృష్ణయ్య, బాలయ్య, కర్నెన్న, మన్నెం, మహేష్, విష్ణు, రాజు తదితరులు ఉన్నారు.

పంచాయతీ కార్యదర్శి మృతికి సంతాపం



తిరుపతమ్మ(ఫైల్)

అడ్డాకుల: మండలంలోని పొన్నకల్‌లో పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న తిరుపతమ్మ(47) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. కొన్నాళ్ల కిందట అనారోగ్యానికి గురవడంతో కుటుంబ సభ్యులు ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స చేయించారు. పరిస్థితి విషమంగా మారడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చగా.. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. ఆమె భర్త రమేష్ కూడా పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్నారు. గతంలో ఆమె అడ్డాకుల మండలంలోని రాచాల, రాంచంద్రాపూర్ గ్రామాల్లో కార్యదర్శిగా పని చేశారు. అంతకు ముందు మూసాపేట మండలంలోని పోల్కంపల్లి, దాసర్‌పల్లి గ్రామాల్లో కార్యదర్శిగా పని చేశారు. కాగా మహబూబ్‌నగర్‌లో నివాసముంటుండగా ఆమె స్వస్థలం గద్వాలలో అంత్యక్రియలు నిర్వహించారు. ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి, ఎంపీడీఓ మంజుల, కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది ఆమె మృతదేహం వద్ద నివాళి అర్పించి సంతాపం వ్యక్తం చేశారు.

చిత్తూ చిత్తుల బొమ్మ



నవాబుపేట: చిత్తూ చిత్తుల బొమ్మ శివుడి ముద్దుల గుమ్మ.. బంగారు బొమ్మ దొరికె నమ్మో ఈ వాడలోనా.. అంటూ మహిళలు ఆటాపాటలతో మండల కేంద్రంలో బతుకమ్మ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఏడాది దసరా తరువాత బతుకమ్మ ముగింపు కార్యక్రమం జరుపుకోవటం ఆనవాయితీ. ఈ సందర్భంగా బతుకమ్మ కార్యక్రమం నిర్వహించి పుట్టింటికి వచ్చిన ఆడపిల్లలకు వాయినాలు అందించి సాగనంపుతారు. ఈ సందర్భంగా బుధవారం గ్రామస్తులు బతుకమ్మలను అలంకరించుకుని ఆటా పాటలతో హోరెత్తించారు. మహిళలు పెద్ద ఎత్తున బతుకమ్మలతో శివాలయం, హనుమాన్ దేవాలయం, ప్రధాన చౌరస్తాల చెంత పెద్దఎత్తున కార్యక్రమం నిర్వహించిన అనంతరం గ్రామ సమీపంలోని పెద్ద చెరువులో నిమజ్జనం చేశారు.

ఆన్‌లైన్ మోసం

శాంతినగర్: గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి బండి కంతు కట్టాలని, లేని పక్షంలో మోటార్ సైకిల్ సీజ్ చేస్తామని హెచ్చరించాడు. దీంతో ఆన్‌లైన్‌లో నగదు పంపి మోసపోయిన ఘటన వడ్డేపల్లి మండలంలోని కొంకల గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం.. నారాయణగౌడ్ మూడేళ్ల క్రితం శాంతినగర్‌లోని షోరూంలో మోటార్‌సైకిల్ కొనుగోలు చేశాడు. ఫైనాన్స్‌లో కంతుల ప్రకారం లావాదేవీలు జరుపుతున్నాడు. ఈ క్రమంలో తాము మహబూబ్‌నగర్ నుంచి ఫోన్ చేస్తున్నామని, 7780273083 బండి కంతు చెల్లించాలని, లేదంటే సీజ్‌చేస్తామని ఒత్తిడి తేవడంతో వారు తెలిపిన 9700770567 నంబర్‌కు ఆన్‌లైన్‌లో రూ.2600 పంపాడు. రెండు మూడు రోజుల నుంచి వారు మాట్లాడిన నంబర్‌కు ఫోన్ చేస్తే ఎవరు లిఫ్ట్ చేయకపోవడంతో తాను మోసపోయినట్లు తెలుసుకున్నాడు. ఈ విషయమై శాంతినగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

పాడి రైతుల ఇబ్బందులు

ఫిర్యాదు చేశారని బిల్లుల నిలిపివేత



దొడ్డిపల్లిలో పాలు పోస్తున్న రైతులు

నవాబుపేట: పాడి రైతులపై కక్ష గట్టిన అధికారులు పాలు తీసుకోకుండా కొన్ని రోజులు ఇబ్బందులకు గురిచేశారు. అనంతరం ఎమ్మెల్యేకు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేయటంతో వారి ఆదేశాలతో పాలు తీసుకున్నారు. తీరా పాలు తీసుకుని వాటికి వచ్చే బిల్లులు ఇవ్వటంలో జాప్యం చేస్తున్నారు. మిగతా గ్రామాల పాడి రైతులందరికీ బిల్లులు అందించి కేవలం అధికారులపై ఫిర్యాదు చేశామని రెండు గ్రామాల రైతుల పాల బిల్లులు మాత్రం ఉద్దేశపూర్వకంగా నిలిపివేశారని ఆ గ్రామాల రైతులు వాపోతున్నారు.

● మండల పరిధిలోని దొడ్డిపల్లి, కూచూర్ గ్రామాలకు చెందిన పాడి రైతులు జడ్చర్లలో విజయ డెయిరీకి పాలు విక్రయిస్తారు. కాగా నెల రోజుల కిందట ఈ రెండు గ్రామాల రైతుల పాలను తీసుకునేందుకు డెయిరీ నిర్వాహకులు నిరాకరించారు. కేవలం పాలపై ఆధారపడి జీవించే పాడి రైతులు తమ ఇబ్బందిని కలెక్టర్‌కు, జడ్చర్ల ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు వారి హెచ్చరికతో పాలు తీసుకున్నారు. కాగా పాలకు సంబంధించిన బిల్లులు ఇవ్వటంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. 15 రోజులకు సంబంధించి కూచూర్‌కు సంబంధించి రూ. 2.30లక్షలు, దొడ్డిపల్లి పాడి రైతులకు సంబంధించి రూ.1.40లక్షల బిల్లులు రావాల్సి ఉంది. పండగ ముందే అందరికి బిల్లులు అందించి ఫిర్యాదు చేశామనే ఉద్దేశంతోనే తమ రెండు గ్రామాల బిల్లులు నిలిపివేశారని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా ఈ విషయంలో సంబంధిత అధికారులను వివరణ కోసం ప్రయత్నించగా.. వారు అందుబాటులో లేరు.

బిల్లులు నిలిపివేశారు



తమ పాలను తీసుకోకుండా కొన్ని రోజులు ఇబ్బందులు పెట్టారు. దీంతో తమ జీవనాధారం ఇబ్బందిగా మారిందని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి, కలెక్టర్ రవినాయక్‌కు ఫిర్యాదు చేశాం. దీంతో వారు హెచ్చరించడంతో పాలు తీసుకోవటం ప్రారంభించారు. కాగా తీరా పాల బిల్లులు వేయకుండా నిలిపివేశారు. అన్ని గ్రామాల బిల్లులు వేసిన వారు కేవలం రెండు గ్రామాల బిల్లులు ఇవ్వకుండా పండగ వేల తీవ్ర ఆవేదన చెందేల చేశారు. ఈ విషయంలో నిర్లక్ష్యం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి. బిల్లులు వెంటనే అందించాలి. – గోపాల్ పాడి రైతు, దొడ్డిపల్లి

తహసీల్దార్ ఎదుట బైండోవర్



తహసీల్దార్ సమక్షంలో బెల్టు షాపుల యాజమాన్యాన్ని బైండోవర్ చేస్తున్న పోలీసులు

బాలానగర్: ఎలాంటి అనుమతులు లేకుండా గ్రామాల్లో బెల్టు షాపుల ద్వారా మద్యం అమ్ముతున్న వారిని ఎస్ఐ శ్రీనివాసులు తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో బైండోవర్ చేసినట్లు తెలిపారు. నాలుగు రోజులగా 157 మందిని బైండోవర్ చేసినట్లు వివరించారు. బైండోవర్ అనంతరం కూడా అదే పని చేసినట్లు అయితే వారిని కోర్టులో హాజరు పరుస్తామని వివరించారు. ఇప్పటి వరకు మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 157 మందిని బైండోవర్ చేసినట్లు అందులో 117 మంది మండల పరిధిలో బెల్టు షాపులు నిర్వహిస్తుండగా.. 40 మందిలో రౌడీషీటర్లు, అనుమానాస్పద వ్యక్తులు ఉన్నట్లు పేర్కొన్నారు.

70 మంది బైండోవర్

జడ్చర్ల టౌన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బుధవారం మండలంలోని 70 మంది బెల్టు దుకాణ నిర్వాహకులను పోలీసులు ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, తహసీల్దార్ శ్రీనివాసులు ఎదుట బైండోవర్ చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున బెల్టు దుకాణాల నిర్వహణ తగదని, మద్యం అమ్మకాలు చేయరాదని వారికి తహసీల్దార్ సూచించారు. అనంతరం వారిని విడిచిపెట్టారు.

జడ్చర్లలో పోలీస్ కవాతు



కవాతు నిర్వహిస్తున్న ఐటీబీసీ బలగాలు

జడ్చర్ల టౌన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బుధవారం పట్టణంలో ఇండో టిబెట్ బార్డర్ పోలీసులతో పాటు స్థానిక పోలీసులు కవాతు(ఫ్లాగ్‌మార్చ్) నిర్వహించారు. పట్టణంలోని నిమ్మబావిగడ్డ ప్రారంభమైన కవాతు ప్రధాన రోడ్డు, ముఖ్యకూడళ్ల వెంట సిగ్నల్ గడ్డ మీదుగా క్రాస్‌రోడ్డు, హౌజింగ్‌బోర్డు కాలని, దర్గా కమాన్ వరకు కవాతు కొనసాగించారు. కవాతులో అదనపు ఎస్పీలు సురేష్‌కుమార్, రాములు, సీఐ రమేష్‌బాబు తోపాటు ఐటీబీపీకి చెందిన 50 మంది పోలీసులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథకాలే అండా: బీఆర్ఎస్



మాట్లాడుతున్న శివకుమార్ తదితరులు

మిడ్జిల్ /రాజాపూర్: రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే మరోసారి అధికారం కట్టబెట్టడానికి అండగా నిలుస్తాయని సంగీతనాటక కళా మండలి రాష్ట్ర మాజీ చైర్మన్ బాద్మిశివకుమార్ అన్నారు. బుధవారం రాజాపూర్‌లో, మిడ్జిల్‌లో విలేకరులతో మాట్లాడారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని అభివృద్ధి తెలంగాణలో జరిగిందని అన్నారు. ముఖ్యంగా ఇంటింటికి తాగునీరు, సాగుకు ప్రాజెక్టులు నిర్మించి సాగునీరు అందించడమే కాకుండా మెనిఫెస్టోలో లేని ఎన్నో సంక్షేమ పథకాలను అందించిన ఘనత మన సీఎం కేసీఆర్ పాలనలో సాకారమైందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని మేనిఫెస్టోలో చెబుతుందని, కాంగ్రెస్ పార్టీలో కుర్చీ కోసమే ఆరాటపడుతారుకాని ఎవరు సీఎం అని గ్యారంటీ మాత్రం లేదని అన్నారు. కాంగ్రెస్‌లో ఎవ్వరికి టికెట్ ఇవ్వాలో ఇంతవరకు తెలియని పరిస్థితి ఉందన్నారు. జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ 14 సీట్లకు 14 గెలుస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు. పరిపాలన సౌలభ్యం కోసం కొత్త జిల్లాలు, కొత్త మండలాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనంతరం టీఆర్ఎస్ మేనిఫెస్టోను కరపత్రాన్ని విడుదల చేశారు. శ్రీశైలంయాదవ్, బచ్చిరెడ్డి, మహిపాల్‌రెడ్డి, రమేష్‌నాయక్, నాగిరెడ్డి, యాదగిరి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ప్రచారం



పోల్కంపల్లిలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

అడ్డాకుల: మూసాపేట మండలంలో బుధవారం బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. పోల్కంపల్లిలో జెడ్పీటీసీ ఇంద్రయ్యసాగర్, పార్టీ అధ్యక్షుడు లక్ష్మి నర్సింహ్మ, కోఆప్షన్ మదీనా జమీర్, నాయకులు కొండయ్య, శివరాములు తదితరులు ఇంటింటికి తిరుగుతూ కారు గుర్తుకు ఓట్లేసి ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని ఓటర్లను కోరారు.

ఘనంగా అమ్మవారి ఊరేగింపు

పాలమూరు: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని లక్ష్మీనగర్ కాలనీలో శ్రీ మాతా రాజరాజేశ్వరి దేవి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారి ఊరేగింపు బుధవారం ఘనంగా నిర్వహించారు. దేవీ నవరాత్రుల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి ఆ తర్వాత నిమజ్జనం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రాఘవరెడ్డి, రవీందర్, జయప్రకాష్, వెంకటేశ్వర్లు, చారి, రాజేందర్, గణేష్, పుల్లయ్య సుధాకర్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ విజయం ఖాయం



రామచంద్రాపూర్‌లో మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్

మహబూబ్‌నగర్ రూరల్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం ఖాయమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బి.రాజేశ్వర్‌గౌడ్ అన్నారు. ప్రజలు బీఆర్ఎస్‌కు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపిస్తారని అన్నారు. బీఆర్ఎస్‌కు ప్రజల మద్దతు ఉందని, ఎవరెన్ని కుట్రలు చేసినా, ఎన్ని అవరోధాలు సృష్టించినా అంతిమ విజయం గులాబీదేనని అన్నారు. బుధవారం మండలంలోని రామచంద్రాపూర్, మాచన్‌పల్లి, పోతన్‌పల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారంపై బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలను సమాయత్తం చేయడం కోసం ఆ పార్టీ జిల్లా, మండల బాధ్యులు పర్యటించారు. ఆయా గ్రామాల్లో కార్యకర్తలను ఉద్దేశించి రాజేశ్వర్‌గౌడ్ మాట్లాడారు. తెలంగాణలో వచ్చేది మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమేనని అన్నారు. సమావేశంలో రైతుబంధు మండల అధ్యక్షుడు మల్లు దేవేందర్‌రెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు అల్లాఉద్దీన్, ముడా డైరెక్టర్ ఆంజనేయులు, శ్రీనివాస్‌యాదవ్, వై.శ్రీనివాసులు, పి.రవీందర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, యాదయ్య పాల్గొన్నారు.

నిలదీసిన బీఆర్ఎస్ కార్యకర్తలు

రామచంద్రాపూర్‌లో ఈ నెల 27న రాష్ట్ర ఎక్సైజ్, క్రీడల శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఎన్నికల ప్రచారంపై బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను సమాయత్తం చేయడం కోసం ఆ పార్టీ జిల్లా, మండల బాధ్యులు రామచంద్రాపూర్ గ్రామానికి వెళ్లగా.. ఆ గ్రామంలోని బీఆర్ఎస్ కార్యకర్తల నుంచి వారికి ఖేదు అనుభవం ఎదురైంది. మంత్రి పర్యటనను విజయవంతం చేయాలని కోరిన నాయకులను ఆ గ్రామంలోని బీఆర్ఎస్ కార్యకర్తలు దళితబంధు, డబుల్ బెడ్రూం గురించి నిలదీశారు. వాటికి సంబంధించిన వివరాలను సమగ్రంగా వివరిస్తేనే తాము మంత్రి పర్యటన విజయవంతానికి సహకరిస్తామని కార్యకర్తలు తేల్చిచెప్పడంతో వారికి సరైన సమాధానం చెప్పి ఒప్పించలేక నాయకులు తమ సమావేశాన్ని అర్ధంతరంగా ముగించుకుని వెనుతిరిగారు.

ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు..

నారాయణపేట: కాలుష్య కారక ఇథనాల్ కంపెనీ రద్దు చేయాలని గత రెండేళ్లుగా స్థానిక ప్రజలు శాంతియుతంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించారని.. హైదరాబాద్‌లో పోరాట కమిటీ నాయకులైన బండారి లక్ష్మయ్య, డి.చంద్రశేఖర్‌లను అదుపులోకి తీసుకున్నా పోలీసులు ఇప్పటి వరకు రిమాండ్ చూపడం లేదని వెంటనే రిమాండ్ చూపించాలని పోరాట కమిటి ప్రతినిధులు పలువురు జిల్లా పోలీసు యంత్రాంగాన్ని కోరారు. బుధవారం స్థానిక బీఆర్ అంబేద్కర్‌భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎక్లాస్‌పూర్ లాఠీచార్జ్‌కు పూర్తి బాధ్యత డీఎస్పీదేన్నారు. ఈ కంపెనీని రక్షించడానికే ప్రజలపై లాఠీచార్జీ చేసి విధ్వంసాన్ని సృష్టించారని, చిత్తనూరు, ఎక్లాపూర్, జిన్నారం తదితర గ్రామాల్లోని ప్రజలందరిని ఇళ్లల్ల తలుపులు పగలగొట్టి మహిళలు వృద్ధులని చూడకుండా దారుణంగా దాడిచేసి ఈడ్చుకెళ్లారన్నారు. భయభ్రాంతులకు గురై పురుషులందరూ గ్రామాలను విడిచి వెళ్లిపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. అరెస్టు చేసిన వారిని రిమాండ్ చూపించాలని, కుటుంబ సభ్యులకు అప్పజెప్పాలని డిమాండ్ చేస్తున్నమన్నారు. సమావేశంలో డి.చంద్రశేఖర్ సతిమణి స్వరూప, బండారి లక్ష్మయ్య సతిమణి శిరీష, ఖలీల్, బి.నర్సప్ప, నరేశ్ ఉన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ చేయాలి

మరికల్: ఇథనాల్ కంపెనీకి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న గ్రామస్తులపై పోలీసులు చేసిన లాఠీచార్జ్ హైకోర్టు సిటింగ్ జడ్జితో విచరణ జరిపించాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవింద్యల డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ నాయకుల ప్రచారం

అడ్డాకుల: కాంగ్రెస్ నాయకులు మండలంలో బుధవారం ఇంటింటి ప్రచారం చేశారు. రాచాల, కందూర్, గుడిబండ గ్రామాల్లో గడప గడపకు తిరుగుతూ వచ్చే ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓట్లేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. తిరుపతయ్య, సునిత్, సత్యనారాయణ, అనిల్ పాలల్గొన్నారు.

ఉమ్మడి పాలమూరులో మేరా మట్టి మేరా దేశ్



కార్యక్రమంలో పాల్గొన్న నెహ్రూ యువజన సంఘం జిల్లా కోర్డినేటర్ కోట్యానాయక్

బాలానగర్: ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో నెహ్రూ యువజన కేంద్రం ఆధ్వర్యంలో మేరా దేశ్-మేరా మట్టి కార్యక్రమాన్ని ఎంపీడీఓ కృష్ణారావు సమక్షంలో నిర్వహించారు. కార్యక్రమానికి వివిధ గ్రామాల నుంచి గిరిజనులు, ఇతరులు మట్టిని కళశాల్లో తెచ్చి యువజన కేంద్ర సభ్యులకు అందజేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లా నుంచి 74 కేంద్రాల్లో ఈ మట్టి కళశాల సేకరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కోర్డినేటర్ కోట్యానాయ్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి మండలం నుంచి సేకరించిన మట్టిని ఈ నెల 27న గవర్నర్ తమిలిసై సమక్షంలో ప్రదర్శించిన దేశం కోసం అసువులు బాసిన స్వాతంత్ర్య సమరయోధుల జ్ఞాపికగా ఉద్యానవణాన్ని నిర్మించేందుకు ఉపయోగించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కోర్డినేటర్ రాజేష్, అనిల్‌కుమార్, రాజేందర్ గౌడ్, కళాజాతా బృందం సభ్యులు, గిరిజన మహిళలు పాల్గొన్నారు.

నేరాలకు పాల్పడితే పీడీయాక్ట్ నమోదు

పాత నేరస్తులకు కౌన్సెలింగ్ ఇచ్చిన డీఎస్పీ



మాట్లాడుతున్న డీఎస్పీ టి.మహేష్

మహబూబ్‌నగర్ క్రైం: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి గొడవలు, ఇబ్బందులు సృష్టించరాదని, చట్టవ్యతిరేక కార్యకలాపాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ టి.మహేష్ అన్నారు. టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పాత నేరస్తులకు బుధవారం డీఎస్పీ కార్యాలయం వద్ద డీఎస్పీ కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రతి పాత నేరస్తుడు ఇప్పటికే బైండోవర్ చేయడం జరిగిందని, చిన్న సమస్య సృష్టించినా.. కేసులు నమోదు చేస్తామన్నారు. ఏదైనా గొడవలు, చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే ఆరు నెలల జైలు శిక్షతో పాటు జరిమానా డబ్బులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. పాత నేరస్తులు శాంతి భద్రతలకు భంగం కల్గించే కొత్త నేరాలకు పాల్పడితే పీడీయాక్ట్ కేసులు నమోదు చేస్తామన్నారు. సమావేశంలో టూటౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

బెల్టు షాపుల వివరాల సేకరణ

- దసరా పేరుతో 'కోడ్' ఉల్లంఘన కథనానికి స్పందన
- మద్యం విక్రయాలపై సీరియస్

సాక్షి ఎఫెక్ట్..

గండేడ్: బెల్ట్ షాపుల్లో మద్యం అక్రమ విక్రయాలపై 'సాక్షి' దినపత్రికలో కథనానికి అధికారుల్లో చలనం వచ్చింది. బుధవారం దసరా పేరుతో 'కోడ్' ఉల్లంఘన శీర్షికన వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. దసరా పండుగ కావడంతో గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు మూడు రోజులుగా కొనసాగాయి. దీనిపై అధికారులు నిమ్మకుండి పోయారు. ఫలితంగా బెల్ట్ షాపుల నిర్వాహకులు అధిక ధరలకు విక్రయించడంతో పాటు ఇష్టారాజ్యంగా అమ్మకాలు కొనసాగించారు. ఈ విషయాన్ని 'సాక్షి' వెలుగులోకి తీసుకొచ్చింది. దీంతో అధికారుల్లో కదలికలు వచ్చాయి. అక్రమ విక్రయాలపై ఇంటలిజెన్సు, ఎస్‌బి, స్థానిక పోలీసులు అధికారులతో పాటు సంబంధిత ఎక్సైజ్ అధికారులు రంగంలో దిగారు. దీనిపై ఏయే గ్రామాల్లో ఎవరెవరు అమ్ముతున్నారు, ఎక్కడెక్కడ అమ్ముతున్నారనే విషయాలపై బుధవారం ఆరా తీశారు. ఈ మేరకు రెండు మండలాల పరిధిలోని గండేడ్, వెన్నాచేడ్, మహమ్మదాబాద్, పగిడ్యాల్, మొకర్లాబాద్, నంచర్ల, గాధిర్యాల్, కొంరెడ్డిపల్లి, సల్కర్‌పేట్, బల్సూర్‌గొండ తదితర గ్రామాల్లో సంబంధిత అధికారులు విడివిడిగా వివరాలు సేకరిస్తున్నారు. గతంలో బెల్ట్ షాపు నిర్వాహకులకు హెచ్చరికలు జారీ చేశారు. అయినా వారిలో మార్పులేకపోయింది. పైగా 'సాక్షి'లో కథనం రావడంతో అన్ని శాఖల్లో అధికారులు దీనిని సీరియస్‌గా తీసుకుంటున్నారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు పూర్తిగా కట్టడి చేయాలని ఉద్దేశంతో తగిన చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ఈ మేరకు బెల్ట్ షాపుల నిర్వాహకుల నుంచి మద్యం అమ్మమని బుధవారం రాయించుకున్నట్లు సమాచారం. ఏది ఏమైనా అధికారులల్లో ఇన్నాళ్లకు రాని చైతన్యం 'సాక్షి' కథనంతో వచ్చింది.

కమీషన్లకు కక్కుర్తిపడి నాణ్యతలేని ప్రాజెక్టు నిర్మాణం



బాలానగర్‌లో మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు

బీఎస్పీ జడ్చర్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ శివకుమార్

బాలానగర్: రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చి కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి సంవత్సరాలు గడవక ముందే ప్రాజెక్టు నాణ్యత తేటతెల్లం అయ్యిందని రూ.లక్షల కోట్ల ప్రజాధనాన్ని నీటిలో పోశారని బీఎస్పీ జడ్చర్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ శివకుమార్, అధ్యక్షుడు లీడర్ శ్రీను వాపోయారు. బుధవారం బాలానగర్ మండల కేంద్రంలో మాట్లాడారు. కాళేశ్వర ప్రాజెక్టులో నీటిని నింపడానికి రూ.వేల కోట్లు ఖర్చు చేసి లక్షల మెగావాట్ల విద్యుత్ ఉపయోగించి నింపిన నీరు.. నాసిరక ప్రాజెక్టు నిర్మాణంతో సముద్రం పాలు కానుందని అన్నారు. నాసిరకం పనులతో రూ.కోట్ల ప్రజాధనం కమీషన్ల రూపంలో కేసీఆర్ కుటుంబం జేబుల్లోకి వెళ్లాయని ఆరోపించారు. ఎలాంటి నాణ్యత ప్రమాణాలు పాటించకుండా నిర్మాణం చేపడితే తెలంగాణ ప్రాజెక్టులే నిదర్శనం అని ప్రపంచానికి చాటి చెప్పేలా కాళేశ్వర ప్రాజెక్టు రికార్డు సాధించనుందని గుర్తుచేశారు. నియోజకవర్గ బీఎస్పీ ఇన్‌చార్జ్ శివకుమార్, నాయకులు రంజిత్, సురేష్, శ్రీకాంత్, రాజు, చంద్రయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణికులకు ప్రత్యేక డీలక్స్ లాంజ్

మహబూబ్‌నగర్ బస్టాండ్‌లో ఏర్పాటు



బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక లాంజ్

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో సూపర్ లగ్జరీ డీలక్స్ బస్సులో ప్రయాణించేవారి సౌకర్యార్థం ప్రత్యేక లాంజ్ ఏర్పాటు చేశారు. మహబూబ్‌నగర్ బస్టాండ్ నుంచి హైదరాబాద్‌కు సూపర్ లగ్జరీ (నాన్‌స్టాప్) బస్సుల్లో చాలా మంది ప్రయాణికులు వెళ్తుంటారు. మహబూబ్‌నగర్ బస్టాండ్ నుంచి గత కొన్ని నెలల నుంచి సూపర్ లగ్జరీ బస్సుల్లో ప్రయాణించే వారి సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. దీనిని దృష్టిలో పెట్టుకొని ఆర్టీసీ అధికారులు ప్రత్యేక లాంజ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. సూపర్ లగ్జరీ బస్సు కదిలేలోపు లాంజ్‌లో కూర్చొడానికి ప్రయాణికులకు 20 కుర్చీలు, ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. త్వరలో ఆర్టీసీ ఈడీ చేతులమీదుగా త్వరలో ప్రత్యేక లాంజ్‌ను ప్రారంభించడానికి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు రీజినల్ మేనేజర్ శ్రీదేవి తెలిపారు. భవిష్యత్‌లో లాంజ్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం మరిన్ని వసతులు ఏర్పాటు చేస్తామని ఆర్ఎం తెలిపారు.

అ'పూర్వ'విద్యార్థుల సమ్మేళనం



నవాబుపేట జెడ్పీ పాఠశాలలో పూర్వ విద్యార్థులు

నవాబుపేట: మండల కేంద్రంలో 1996–97 విద్యా సంవత్సరం పదో తరగతి విద్యార్థులు బుధవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో నాటి గురువులను నాడు చదివిన పాఠశాలలో 27 సంవత్సరాల అనంతరం ఘనంగా సన్మానించారు. నాటి మధుర స్మృతులు నెమరువేసుకుని సరదాగా గడిపారు. ఈ సందర్భంగా 1996–97 బ్యాచ్‌కు చెందిన నవాబుపేట విద్యార్థి రఘుకుమార్ సీఐగా విధులు నిర్వహిస్తుండటంతో అతడిని మిత్ర బృందం ఘనంగా సన్మానించింది. అనంతరం పూర్వ విద్యార్థులు తమ గురువులు చంద్రకళ, కృష్ణరెడ్డి, చంద్రప్పలను సన్మానించారు. శ్రీనివాస్, నర్సింహ, జన్ను, ప్రశాంతి ఉన్నారు.